
సాక్షి
కాకినాడ
శుక్రవారం । 14 । జూలై । 2023



డెల్టాలకు 13,600 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి పప్పల నాగేశ్వరరావు, భానుమతి దంపతులు (కాకినాడ) గురువారం రూ.1,11,116 విరాళంగా అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే కృష్ణంరాజుకు కన్నీటి వీడ్కోలు



మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజుకు రాజోలు నియోజకవర్గ ప్రజలు, అభిమానులు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రత్యేక వాహనంలో వందలాది మంది అభిమానులతో కృష్ణంరాజు పార్థివ దేహాన్ని ఊరేగింపుగా రాజోలు వశిష్ట తీరంలోని కైలాసభూమికి తీసుకువచ్చారు. - IIలో▸

వానందమాయె..

- తాజా వర్షంతో అన్నదాతలో సంతోషం
- మెట్టలో వడివడిగా నారుమళ్ల పనులు
- మరికొన్ని ప్రాంతాల్లో జోరందుకున్న నాట్లు
- ఆర్బీకేల్లో ఎరువులు..విత్తనాలు సిద్ధం

సాక్షిప్రతినిధి, కాకినాడ: కాస్త ఆలస్యంగానైనా తొలకరి పలకరించడంతో ఖరీఫ్ రైతులు పులకించిపోతున్నారు. చినుకు కోసం నిరీక్షిస్తోన్న రైతులకు గురువారం నాటి వర్షం ఊరటనిచ్చింది. ఈ ఖరీఫ్ సీజను మొదలయ్యాక ఇదే పెద్ద వాన అని రైతులు చెబుతున్నారు. జిల్లాలో తెల్లవారుజాము నుంచి మోస్తరుగా మొదలై అక్కడక్కడా భారీ వర్షం కురిసింది. ముందస్తు పంట ప్రణాళిక అమలుకు ప్రభుత్వం జూన్‌ఒకటో తేదీనే పంట కాలువలకు నీరు విడుదల చేసింది. కానీ నైరుతి రుతుపవనాల జాప్యం, అధిక ఉష్ణోగ్రతలు వ్యవసాయ పనులకు ప్రతిబంధకమయ్యాయి. నారుమడులు ఎండిపోతాయనే భయంతో గత నెల మొదటి రెండు వారాలు పనులు చేపట్టేందుకు సంకోచించారు. తాజాగా వర్షాలతో రైతులు నారుమళ్లు పోసుకునేందుకు ధైర్యంగా ముందుకు వెళుతున్నారు.

కోనసీమలో నాట్లకు సిద్ధం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు వ్యవసాయ సబ్ డివిజన్‌ల పరిధిలో 62.6 శాతం వరి నారుమళ్లు పోసిన రైతులు గురువారం నాటి వర్షంతో నాట్లకు సిద్ధపడుతున్నారు. కాకినాడ జిల్లాలో గోదావరి ఆయకట్టు పరిధిలోని నీరు పుష్కలంగా ఉండడంతో ఇప్పటికే నారు సిద్ధం చేశారు. కొందరు వెదజల్లు సాగుకు మొగ్గు చూపుతున్నారు. తాళ్లరేవు, సామర్లకోట, పెదపూడి, కరప, మండలాల్లో నాడుమడులు, వరినాట్లు ఊపందుకున్నాయి. ఏలేరు ఆయకట్టు పరిధిలో 225 హెక్టార్లలో వరినారు సిద్ధం చేసుకోగా 300 హెక్టార్లలో వెదజల్లు సాగు చేశారు.

లంకల్లో దుక్కుల జోరు

సెంట్రల్ డెల్టా పరిధిలో ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. ఉప్పలగుప్తం, సన్నవిల్లి, గొల్లవిల్లి, నంగవరం, గాడిలంక, కర్రివానిరేవు, కొత్తలంక తదితర ప్రాంతాల్లో దుక్కులు దున్నడంలో బిజీగా ఉన్నారు. ఖరీఫ్‌లో నారుమళ్ల నుంచి నాట్ల వరకు తూర్పు డెల్టా రైతులు ఎప్పుడూ ముందుంటారు. ఈసరికి 60శాతం పైనే నాట్లు పూర్తి చేసేవారు. ఈసారి సకాలంలో వర్షాలు కురవక పోవడంతో నారుమళ్లు ఆలస్యంగా వేశారు. వీరిప్పుడు నాట్లకు రెడీ అవుతున్నారు.



గండేపల్లి మండలం మురారిలో నాట్లు వేస్తోన్న దృశ్యం

ముందస్తుకు ప్రోత్సాహం

నవంబర్‌లో తుపానుల ముప్పు తప్పేలా అక్టోబర్ నెలాఖరుకు తొలకరి సాగు పూర్తిచేసేలా వ్యవసాయ శాఖ గత రెండు సీజన్ల నుంచి ముందస్తు సాగును ప్రోత్సహిస్తోంది. మండపేట, రామచంద్రపురం, అనపర్తి నియోజకవర్గాల పరిధిలో ముందుగానే పనులు మొదలయ్యేవి. ఈ సమయానికి 75 శాతానికి పైగా నాట్లు, వెదజల్లు సాగు చేసేవారు. కొందరు బోర్ల కింద పనులు మొదలుపెట్టగా తాజా వాతావరణంతో మరికొందరు పనులు వేగవంతం చేశారు. అనపర్తి, రామచంద్రపురం వ్యయసాయ సబ్ డివిజన్‌లలో ఇప్పటి వరకు 30 శాతం నాట్లు వేశారు. ఆలమూరు, మండపేట, రామచంద్రపురం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు వెదజల్లు, నాట్లలో ముందున్నాయి.

ఎక్కడ ఎలా 'సాగు'తోందంటే..

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెట్టలో ఇప్పుడు ఖరీఫ్ నారుమళ్లకు సిద్ధపడుతున్నారు. గండేపల్లి, మల్లేపల్లి వంటి ప్రాంతాల్లో నారు చేతికందడంతో ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.
- తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, గోపాలపురం, రాజానగరం తదితర నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల్లో ట్యాంకులు, బోర్లు ఆధారంగా నారుమళ్లు పోసుకున్నారు. గురువారం వర్షంతో నాట్లకు ఇక్కడి రైతులు సమాయత్తమవుతున్నారు.
- గండేపల్లి, ఏలేశ్వరం, జగ్గంపేట, గోకవరం, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల్లో 20 వేల ఎకరాలలో నాట్లు పూర్తి చేశారు.
- కాకినాడ జిల్లా తిమ్మరాజుచెరువు, పెదబాపన్న చెరువు, సుబ్బారెడ్డిసాగర్ తదితర ట్యాంకుల కింద నారు వేసేందుకు రైతులు దమ్ములు చేస్తున్నారు.
- పంపా, పుష్కర, చాగల్నాడు, కొత్త వెంకటనగరం, తొర్రిగడ్డ, పుష్కర తదితర ఎత్తిపోతల పథకాల ద్వారా ఈ నెల 15న సాగునీరు విడుదలైతే ఖరీఫ్ పనులు వేగం పుంజుకోనున్నాయి.
- తూర్పుగోదావరి జిల్లాలో చాగల్లు మండలంలో గరిష్టంగా 43.48 శాతం, నిడదవోలులో 43.13 శాతం, కొవ్వూరులో 36.99 శాతం నాట్లు పూర్తయ్యాయి.
- కాకినాడ, డాక్టర్ కోనసీమ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలతో పోలిస్తే తూర్పుగోదావరిలో నాట్ల పరిస్థితి ఆశాజనకంగా ఉంది. ఈ జిల్లాలో సగటున 23.21 శాతం ఆయకట్టులో నాట్లు పూర్తయ్యాయి.

కాకినాడ జిల్లాలో...

సాగు లక్ష్యం	: 2.20 లక్షల ఎకరాలు
ఇప్పటి వరకూ వరి నారు వేసింది	: 2,500 ఎకరాలు
వరినాట్లు వేసింది	: 9,056 ఎకరాలు
వెదజల్లు సాగు	: 3,800 ఎకరాలు

ఎరువులు...

అవసరమైనవి	: 65 వేల మెట్రిక్ టన్నులు
సిద్ధం చేసినవి	: 23,250 మెట్రిక్ టన్నులు

విత్తనాలు

అవసరమైనవి	: 68,280 క్వింటాళ్లు
రైతుల సొంత తయారీ	: 50,800 క్వింటాళ్లు
ప్రైవేటు డీలర్ల వద్ద	: 13,225 క్వింటాళ్లు
సహకార సంఘాల్లో	: 532 క్వింటాళ్లు
వ్యవసాయశాఖ రాయితీ విత్తనాలు	: 3,500 క్వింటాళ్లు

వర్షాలతో ఖరీఫ్ సాగుకు సానుకూలం



వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు ఊతమిస్తోంది. గత వారంలో కురిసిన వర్షాల కంటే ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇంతవరకు వరి నారుమళ్లు వేసిన రైతులు నాట్లకు సిద్ధ పడుతున్నారు. మెట్ట ప్రాంతంలో బోర్లపై వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

– విజయకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ

ప్రైవేటు స్కూల్ మూసివేతకు ప్రయత్నాలు

- ఆందోళన చేసిన తల్లిదండ్రులు
- విచారణ చేపట్టిన విద్యాశాఖ అధికారులు



జగ్గంపేట రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు టీసీలు ఇవ్వడంపై విచారణ చేస్తున్న ఎంఈఓ స్వామి

జగ్గంపేట: స్థానిక రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్‌ను మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించుకుంది. ఈ మేరకు విద్యార్థులకు టీసీలు ఇచ్చి బయటకు పంపేస్తున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఉదయం స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. అర్ధాంతరంగా పాఠశాలను మూసివేస్తే తమ పిల్లల భవిష్యత్ ఏమిటని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఎంఈఓ ఆర్.స్వామి పాఠశాల వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. తల్లిదండ్రులు తమ గోడును వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలకు 2024 వరకూ రికగ్నైజేషన్ ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, తగినంతమంది అధ్యాపకులు లేకపోవడంతో పాఠశాలను మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించుకుందని తెలిపారు. దీనిపై డీవైఈఓకు ఫిర్యాదు చేశామని, శుక్రవారం విచారణ చేపడతారని తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ 160 మంది విద్యార్థులు ఉండగా వీరిలో 30 మందికి పైగా టీసీలు ఇచ్చేశారని ఎంఈఓ స్వామి తెలిపారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను ఎక్కడ జాయిన్ చేయాలన్న దానిపై ఆలోచిస్తామని ఎంఈఓ స్వామి వివరించారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి ఫీజులు వసూలు చేసి ఇప్పుడు స్కూల్ మూసివేస్తున్న రవీంద్ర భారతి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర నాయకుడు కడితి సతీష్ డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

రూ.1.5లక్షలు ధర పలికిన కచ్చిడి చేప



కాకినాడ రూరల్: కాసుల వర్షం కురిపించే కచ్చిడి చేప ధరలో మేటి అనిపించుకుంది. కాకినాడ కుంభాభిషేకం వద్ద గురువారం వేలం పాటలో ఒక కచ్చిడి మగ చేప రూ.1.5 లక్షలు పలికింది. సుమారు 18 కిలోల బరువు చేపను వేలం పాటలో ఒక వ్యాపారి కొన్నారు. కచ్చిడి చేప పొట్ట లోపల ఉంటే బ్లాడర్‌కు డిమాండ్ ఉండడంతో అధిక ధరలకు కొనుగోలు చేస్తారని మత్స్యకారులు చెప్పారు.

తలుపులమ్మతల్లికి లక్ష బిల్వార్చన



విశేషాలంకరణలో తలుపులమ్మతల్లి

తుని రూరల్: లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారికి గురువారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా వేద పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి లక్ష బిల్వాలతో అర్చన చేశారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణపై దృష్టి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024 రూపకల్పనలో భాగంగా చేపట్టిన మార్పులు చేర్పుల ప్రక్రియపై ఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా ప్రక్రియ పురోగతి, సవరణ జాబితా అభ్యంతరాలు పరిష్కారం, మార్పులు, చేర్పులు ఎలక్టోరల్ రోల్స్, బీఎల్‌వోల శిక్షణ, ఇంటి నంబర్ తనిఖీ, మరణించిన వారి వివరాలు వంటి అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియన్నారు. దీనిపై ఈఆర్‌ఓలు దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయి బీఎల్‌ఓలను సమన్వయం చేసుకుని జాబితా రూపొందించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొంటారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మంత్రి అప్పలరాజు రాక

కాకినాడ సిటీ: రాష్ట్ర పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం కాకినాడ రానున్నారు. విజయవాడ నుంచి ఉదయం బయలుదేరి స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి 12.30 గంటలకు చేరుకుంటారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొనను న్నారు. అనంతరం ఆయన పలాస వెళ్తారు.

తొండంగి ఎంపీపీగా దడాల సువర్ణలత



సువర్ణలతకు నియామకపత్రం అందజేసిన ఎన్నికల అధికారి కె.ఎస్.వి.ప్రసాద్

ఏకగ్రీవంగా ఎన్నికైన కోదాడ ఎంపీటీసీ

తొండంగి: మండల పరిషత్ అధ్యక్షురాలిగా వైఎస్సార్ సీపీకి చెందిన కోదాడ ఎంపీటీసీ–1 దడాల సువర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ అనారోగ్యంతో ఇటీవల మరణించిన నేపథ్యంలో గురువారం ఎన్నిక జరిగింది. పెద్దాపురం డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉదయం నుంచి కుండపోతగా వర్షం పడుతున్నా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. మండల పరిధిలోని 25 ఎంపీటీసీలకుగానూ ఎంపీపీ అభ్యర్థి సువర్ణలత సహా 15 మంది హాజరయ్యారు.ఎంపీపీ అభ్యర్థిగా కోదాడ–1 ఎంపీటీసీ దడాల సువర్ణలత బీ ఫారం సమర్పించారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి ప్రసాద్ ఎన్నికను ప్రారంభించారు.దడాల సువర్ణలతను వేమవరం ఎంపీటీసీ కటారి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదించగా 15 మంది ఎంపీటీసీలు బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎంపీపీగా సువర్ణలత ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రసాద్ ప్రకటించారు. ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎంపీపీగా సువర్ణలత ప్రమాణ స్వీకారం చేశారు.జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బూర్తి కృష్ణ, వైస్ ఎంపీపీ–2 యాదాల రమణ, పార్టీ నాయకులు గాబు రాజు, దడాల విజయబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు ఆమెకు అభినందనలు తెలిపారు.

వలంటీర్లను కించపరిస్తే మూల్యం తప్పదు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ద్వారంపూడి మండిపాటు
- వలంటీర్లకు దన్నుగా నిలుస్తామని భరోసా



సదస్సుకు హాజరైన వలంటీర్లు. (అంతరచిత్రం) మాట్లాడుతున్న ద్వారంపూడి

కాకినాడ: ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యానిస్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రానున్నరోజుల్లో తగిన మూల్యం చెల్లించకతప్పదని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. పవన్ తమను అవమానపరిచేలా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక సూర్యకళామందిరంలో గురువారం వలంటీర్ల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. వలంటీర్లకు ద్వారంపూడి సంఘీభావం ప్రకటిస్తూ మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలు సోమరిపోతులవుతున్నారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మహిళల అక్రమరవాణా చేసే వ్యక్తులకు వలంటీర్లు సమాచారమిస్తున్నారంటూ పవన్ వ్యాఖ్యానించడం శోచనీయమని విమర్శించారు. వీరి మనోభావాలు దెబ్బతీస్తూ జగన్ గుండెకాయలాంటి వలంటరీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలన్నది పవన్ పన్నాగమన్నారు. ఇది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని, రానున్న రోజుల్లో మరింత మంచి జరగబోతుందని ద్వారంపూడి వీరికి హామీ ఇచ్చారు. వలంటీర్ అరుణ మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌లా తాముకూడా సహనం కోల్పోయి మాట్లాడగలమని... అయితే సీఎం జగన్ తమకు సహనం, ఓర్పుతో పనిచేసే సేవకుల బాధ్యతను అప్పగించారన్నారు. అందుకే ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోందన్నారు. వలంటీర్లు రోడ్డెక్కే పరిస్థితి తీసుకొస్తే దానివల్ల కలిగే పరిణామాలకు పవన్ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వలంటీర్ లోవరాజు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా నిస్వార్థంగా సేవలందిస్తోన్న వలంటీర్ల మనస్సు గాయపరిచేలా రాజకీయ లబ్ధికోసం విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మరో వలంటీర్ నాగరత్నం మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి సేవలందిస్తే స్పందించలేని పవన్‌కల్యాణ్‌వంటి నాయకులు ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. వలంటీర్ శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో వలంటీర్‌కు ప్రత్యేక గౌరవాన్ని, గుర్తింపును తెచ్చారన్నారు. వలంటీర్ ధర్మ మాట్లాడుతూ పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్ సుభద్ర మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ చేతనైతే తమ మధ్యకు వచ్చి విమర్శలు చేస్తే తగిన సమాధానం చెబుతామన్నారు.

కొలువుల పంట పండింది

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లలలో ముందంజ
- సత్తా చాటిన జేఎన్‌టీయూ(కే) విద్యార్థులు
- 550 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆఫర్లు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ(కే) విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో కొలువులు దక్కించుకున్నారు. విద్యా సంవత్సరం పూర్తయ్యేలోపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఉద్యోగాలు సాధించారు. వర్సిటీలో బీటెక్ 441 మంది,ఎంటెక్ 204 మంది ఫైనల్ ఇయర్ చదువుతుండగా వీరిలో 550మందికి 21 బహుళజాతి సంస్థల్లో ఆఫర్లు వచ్చాయి. గడచిన మూడు నెలల్లో సంస్థలు ఎంపికలు నిర్వహించాయి. ఒక్కో విద్యార్థికి రెండు,మూడు సంస్థల్లో కూడా ఉద్యోగాలు సాధించారు. వార్షిక వేతనం రూ.3.36 లక్షల నుండి అత్యధికంగా 16.3 లక్షలతో ఉద్యోగాలు పొందారు.

ముందుగానే మెళకువలు

సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు ఒరాకిల్,డార్విన్ బాక్స్,ఇంటెల్,యునైటెడ్ ఆన్‌లైన్, ఫ్యాక్ట్‌సెట్, ఐబీఎం, టీసీఎస్,అసెంచర్, ఇన్ఫోసిస్ లాంటి సంస్థలతో పాటు కోర్ ఇంజినీరింగ్ కంపెనీలు జేఎస్‌డబ్ల్యూ,ఎల్ అండ్ టీ,డెక్కన్ కెమికల్, మేథా సెర్వో వంటి వాటితో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందాలు చేసుకుంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్న అంశాలు,విధానాలపై ముందుగా క్యాంపస్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. భావ వ్యక్తీకరణ నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై ప్రత్యేక సెమినార్లు నిర్వహిస్తున్నారు. దీంతో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు సత్తా చాటగలిగారు. వీరి విజయం వెనుక వివిధ విభాగాల అధ్యాపకులతో పాటు కళాశాల ప్లేస్‌మెంట్ కార్యాలయం పాత్ర ప్రముఖంగా ఉంది.

రెండు ఉద్యోగాలు వచ్చాయి



ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ టీసీఎస్, సెయింట్ సంస్థల్లో రెండు ఉద్యోగాలు వచ్చాయి. కళాశాలలోని ప్లేస్‌మెంట్ కార్యాలయం ద్వారా మెళకువలు నేర్చుకున్నాను. కంపెనీల సమాచారం ముందుగా తెలియజేయడం వల్ల ఎంతో మేలు జరిగింది. ఇటీవల తిరుచ్చి నిట్‌లో ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎంటెక్ సీటు సాధించాను.

– కే.ధనుష్, విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది.



మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాను. క్యాంపస్ ఇంటర్వ్యూలో జేఎస్‌డబ్ల్యూలో రూ.9.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. ముఖ్యంగా కోడింగ్ అంశాలపై దృష్టి సారించాను. కళాశాలలో నిర్వహించిన సెమినార్లు,శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకున్నాను. ప్రారంభ దశలో అధిక వేతనంతో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

– చవ్వాకుల యుక్తిశ్రీ, మెకానికల్ విద్యార్థి

ట్రేడింగ్ టెక్నాలజీలో పట్టు



మంచి సంస్థలో ఉద్యోగం సాధించాలంటే ట్రేడింగ్ టెక్నాలజీలో పట్టు సాధించాలి. వాటిలో అప్లికేషన్లు,యాప్,వెబ్‌సైట్‌లు క్రియేట్ చేయాలి. ఇలా చేయడంతో ఫ్యాక్ట్‌సెట్ సంస్థలో ఏడాదికి రూ.10 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్‌లో ఉండగా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ప్లేస్‌మెంట్ సెల్ సహకారం బాగా దోహదపడింది.

– పి.మధుసుధనరెడ్డి, సీఎస్‌ఈ విద్యార్థి

నిత్య సాధన చేయాలి



ఉద్యోగ ఎంపిక విధానం పూర్తిగా మారింది. ఇప్పటికే టీసీఎస్ రాత పరీక్ష కొత్త విధానంలో చేపడుతుంది. ఎంపిక మార్పు వల్ల పోటీ పెరిగింది. ఏదో ఒక పోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై పట్టు ఉండాల్సిందే. కాంపిటేటివ్ కోడింగ్‌పై రోజూ ప్రాక్టీస్ చేయాలి. ప్రతిభ మెరుగుపరచుకునేందుకు నిత్యం సాధన చేయాలి. క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు అవగాహన సదస్సులు,మెళకువలు సూచిస్తున్నాం.

– కరుణ అరవ, సీఎస్‌ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్

పెద్దాపురంలో అత్యధిక వర్షపాతం

కాకినాడ సిటీ: జిల్లాలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. పెద్దాపురం మండలంలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదు కాగా అత్యల్పంగా శంఖవరం మండలంలో 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీ నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో) ఇలా... తునిలో 41.2, కాకినాడరూరల్‌లో 24.8, గండేపల్లి 22.4, గొల్లప్రోలు 19.8, కోటనందూరు 10.8, తాళ్లరేవు 8.2, జగ్గంపేట 7.2, కాకినాడ అర్బన్ 6.8, పెదపూడి 5.4, రౌతులపూడి 5.2, సామర్లకోట 5.0, పిఠాపురం 4.2, కరప 3.6, ప్రత్తిపాడు 2.8, యుకొత్తపల్లి 2.6, ఏలేశ్వరం 2, కిర్లంపూడి 1, కాజులూరు 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రేపు సాగునీరు విడుదల

రాజానగరం: ఖరీఫ్ సాగుకోసం ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలను శనివారం విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు కాతేరు వద్ద చాగల్నాడు ఎత్తిపోతల పథకం నుంచి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నీటిని విడుదల చేస్తారన్నారు. 11.30 గంటలకు చాగల్నాడుకు సమీపంలోని కొత్త వెంకటనగరం, మధ్యాహ్నం 12.30 గంటలకు సీతానగరం మండలం పురుషోత్తపట్నం సమీపంలోని తొర్రిగడ్డ, ఒంటిగంటకు పుష్కర ఎత్తిపోతల పథకాల నుంచి నీటి విడుదల జరుగుతుందన్నారు. గతంలో ఆగస్టు వచ్చినా ఎత్తిపోతల పథకాల నుంచి గోదావరి జలాలను వదిలేవారు కాదన్నారు.

క్లుప్తంగా

స్వాహా అయిన 'మద్యం' సొమ్ములో రూ.4.5 లక్షల రికవరీ



సొమ్ము స్వాహా అయిన మద్యం దుకాణం ఇదే

అమలాపురం టౌన్: అమలాపురం ఎర్ర వంతెన దిగువన కామనగరువు రోడ్డులో గల ప్రభుత్వ మద్యం దుకాణం అవుట్ లెట్ సూపర్‌వైజర్ రాయుడు గణేష్ చేతివాటంతో స్వాహా అయిన రూ.11.5 లక్షల్లో అధికారులు రూ.4.5 లక్షలు గురువారం రికవరీ చేశారు. గణేష్ అజ్ఞాతంలో ఉన్నాడు. అయితే అతని తల్లిదండ్రులు, కుటుంబీకులు రూ.4.5 లక్షలను ఏపీ బేవరీస్ అమలాపురం లిక్కర్ డిపో మేనేజర్ పొంగులేటి దశమంతరావుకు గురువారం చెల్లించారు. మిగిలిన సొమ్ము రూ.7 లక్షలను రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని డిపో మేనేజర్‌కు సూపర్‌వైజర్ కుటుంబీకులు హామీ పత్రం రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దశమంతరావు విలేకరులతో మాట్లాడుతూ తొలుత స్వాహా అయిన సొమ్ము రికవరీపై దృష్టి పెట్టామని చెప్పారు. తర్వాత బాధ్యుడైన సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



గంజాయిని విక్రయిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో గంజాయిని విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులను ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన తోరాటి సత్య రామకృష్ణ తన సహచరుడు రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరుకు చెందిన భువనగిరి అరవింద్‌తో కలిసి గంజాయి పొట్లాలను విక్రయించేందుకు బయలుదేరారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆదేశాల మేరకు అప్పటికే ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలో మాటు వేశారు. స్థానిక శ్రీపార్వతీ సమేత మూలేశ్వరస్వామి ఆలయం వైపు నుంచి ఏటిగట్టుకు వెళుతున్న ఆ ఇద్దరి నిందితులను స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కె.జానకిరామయ్య, వీఆర్‌ఓ కె.రాజేశ్వరి సమక్షంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 971 గ్రాముల గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రావులపాలెం సీఐ ఎస్.రజినీకుమార్ దర్యాప్తు చేస్తుండగా ఎస్సై శివప్రసాద్ కేసును నమోదు చేశారు. పోలీసు సిబ్బంది పి.చిట్టిబాబు, పి.గంగాధర్, కె.సురేంద్ర పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధుల గాలం

- రానున్నవి రోగాల రోజులు
- పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- ముందస్తు టీకాలు వేయించాలని సూచన
- రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు



వ్యాధి సోకిన పశువును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

పిఠాపురం: అనుకున్న దానికంటే వర్షాకాలం ఆలస్యంగా మొదలైంది. ఇప్పటి వరకు ఉన్న ఎండలతో పచ్చిగడ్డి దొరకక గడ్డు కాలాన్ని అనుభవించాయి పశువులు. ఇప్పుడు పడుతున్న వర్షాలతో ప్రాణాలు లేచి వచ్చినట్లుగా కొత్తగా వచ్చే పచ్చని పసరును ఆరురావురు మంటూ తినేస్తాయి. ఇప్పటి వరకు మండిన ఎండలు ఇప్పుడు కుండపోత వర్షాలు వెరసి రోగాలను తెచ్చిపెడతాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే పశువులకు ప్రమాదం. తద్వారా రూ.లక్షల విలువైన పశువులు మృత్యువాత పడి రైతులు తీవ్ర నష్టాలను చవి చూసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటివరకు ఎండలు మండుతుండడంతో పచ్చిక బయళ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. చెరువులు, కాలువలు ఎండిపోయాయి. వర్షాలు ప్రారంభం కావడంతో కొత్త నీటితో చెరువులు, కాలువలు నిండి కళకళలాడతాయి. కొత్త పచ్చిక వచ్చి పశువుల నోరూరిస్తుంది. దీంతో వాటిని తిన్న పశువులు అనుకోకుండా వ్యాధుల బారిన పడుతుంటాయి. రోగం తెలుసుకుని చికిత్స చేయించే లోపే ప్రాణాలు పోయే పరిస్థితులు నెలకొంటాయి. కురిసే వాన జల్లులు వీచే చలి గాలులు పశువులపై ప్రబావం చూపుతాయి. సాధారణంగా కొత్త పచ్చిక. కొత్త నీరు, ముసిరే ఈగలు, దోమల వల్ల వర్షాలు ప్రారంభమైన రోజుల్లో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, గాలికుంటు, పాదుగు వాపు, జ్వరాలు, కుం

పాడి-పంట

దేటి వెర్రి, వైరల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తుం టాయి. వ్యాధులు ఆశించే కొద్దీ పాడి పశువుల్లో పాల సామర్థ్యం తగ్గి పోవడంతో పాటు చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధులు ఇలా వస్తాయి..

కొత్తగా వర్షాలు పడడం వల్ల కొత్తగా మొలిచిన గడ్డి తినడం, చెరువులు గుంతల్లో చేరిన నీరు తాగడం వల్ల పశువుల్లో ఎక్కువగా వ్యాధులు వ్యాపిస్తాయి. వీటిలో జబ్బవాపు వ్యాధి సోకడం వల్ల పశువుల జబ్బ వాయడం, జ్వరం అధికంగా రావడం 24 గంటల్లో వైద్య సేవలు అందకపోతే కడుపు ఉబ్బి చనిపోవడం సంభవిస్తుంది. గొంతువాపు వ్యాధి ఎక్కువగా అన్ని వయసుల గేదెలకు వ్యాపిస్తుంది. గొంతు వాచి, అత్యధికంగా 106 నుంచి 107 డిగ్రీల వరకు జ్వరం వచ్చి శ్వాస పీల్చుకోవడం కష్టమై 12 గంటల్లో చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి సోకితే నోటిలో, కాళ్లల్లో కురుపులు ఏర్పడి పశువులు మేత తినక క్షీణించి పోయి పాల ఉత్పత్తి తగిపోవడంతో పాటు పెరుగుదల తగ్గి పోతుంది. గర్భంతో ఉన్న పశువులకు గర్భం పోవడం, చూలి కట్టే సమయంలో ఉన్న పశువులు చూలి కట్టక పోవడం వంటి సమస్యలు వస్తాయి. వర్షాలు పడినప్పుడు కొత్తగా వచ్చిన నీటి ద్వారా జలగ తెగులు వ్యాపిస్తుంది. కొత్త నీటిని తాగిన పశువుల కడుపులోకి నీటి ద్వారా జలగలు ప్రవేశించి పోషకాహార లోపాలను కలగజేస్తుంది. తద్వారా పశువులు పూర్తిగా నీరసించి పోతాయి. పశువుల శాలల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల పాదుగు వాపు వ్యాధి వస్తుంది. వాన జల్లులు పశువుల శాలల్లో పడడం వల్ల పశువు పేడ మూత్రంతో కలిసి పరాన్న జీవులు పెరిగి వ్యాధులకు మూలంగా మారతాయి.

జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు	76,502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,41,229
మేకలు	1,01,870

రాక ముందే జాగ్రత్త పడాలి



వర్షాల ప్రభావంతో పశువులకు వచ్చే వ్యాధులను అరికట్టడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ వ్యాధులు రాకుండా రక్షించే టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. రైతులు వాటిని తమ పశువులకు ముందుగా వేయించుకోవడం ద్వారా వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చు. పశువులు గుంతలు, చెరువుల్లో కలుషిత నీరు, నిల్వ ఉన్న నీటిలో కలిసిన కొత్త నీరు తాగకుండా జాగ్రత్తలు పాటించాలి. వర్షం పడిన సమయంలో పశువుల శాలలను పొడిగా ఉండేలా చూసుకోవాలి. ఈగలు, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. బూటాక్స్ వంటి మందులను ఒక లీటరు నీటిలో 5 మిల్లీలీటర్లు కలిపి పశువులు, పశు శాలల్లో పూర్తిగా తడిసే విధంగా పిచికారీ చేయాలి.

– డాక్టర్ టీఎస్ రమేష్‌చంద్ర, పశుసంవర్ధక శాఖ ఏడీ, పిఠాపురం

మాజీ ఎమ్మెల్యే కృష్ణంరాజుకు కన్నీటి వీడ్కోలు

- రాజోలు వశిష్ట తీరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే రాపాక నివాళులు



నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది



సఖినేటిపల్లిలో మాజీ ఎమ్మెల్యే కృష్ణంరాజు పాడెను మోస్తున్న మంత్రి వేణు, ఎమ్మెల్యే రాపాక

రాజోలు: మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజుకు రాజోలు నియోజకవర్గ ప్రజలు, అభిమానులు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. సఖినేటిపల్లి నుంచి ప్రత్యేక వాహనంలో వందలాది మంది అభిమానులతో కృష్ణంరాజు పార్థివదేహాన్ని ఊరేగింపుగా రాజోలు వశిష్ట తీరంలోని కైలాస భూమికి తీసుకువచ్చారు. కృష్ణంరాజు అమరరహే నినాదాలతో ఆ ప్రాంతమంతా ధ్వనించింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వ లాంఛనాలతో పోలీసు దళాల గౌరవ వందనాలు చేసి తుపాకీలతో మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి ఘనంగా నివాళులర్పించాయి. కృష్ణంరాజు కుమారుడు శ్రీనివాసరాజు అంత్యక్రియల తంతు నిర్వహించి చితికి నిప్పుపెట్టారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు, డీఎస్పీ వెంకటరమణ, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కృష్ణంరాజు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

పాడె మోసి.. రుణం తీర్చుకున్న శిష్యులు

సఖినేటిపల్లి: తమ రాజకీయ గురువు, మాజీ ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు చివరి మజిలీలో ఆయన పాడె మోసి రుణం తీర్చుకున్నారు శిష్యులు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు. గురువారం సఖినేటిపల్లిలో ఆయన ఇంటి వద్ద శకటం పైకి పార్థివ దేహం చేర్చే క్రమంలో పాడెను మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాదరావు మోశారు. గురువు అల్లూరు కృష్ణంరాజు అమర్ రహే అంటూ మంత్రి వేణు, ఎమ్మెల్యే రాపాక, అభిమానులు, కార్యకర్తలు అశ్రు నయనాలతో వీడ్కోలు పలికారు.

తమ్ముళ్లు.. కుమ్ముళ్లు

- టీడీపీ బస్సు యాత్రలో భగ్గుమన్న విభేదాలు
- కలియబడిన రెండు వర్గాలు



గోగన్నమఠంలో కలియబడ్డ టీడీపీ శ్రేణులు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం టీడీపీలో అంతర్గతంగా ఉన్న విభేదాలు గురువారం జరిగిన భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్రలో భగ్గుమన్నాయి. గోగన్నమఠం గ్రామంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వర్గం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిరాజు ఈశ్వరరాజువర్మ వర్గాల మధ్య వివాదం ఏర్పడింది. గొల్లపల్లికి అనుకూలంగా ఒక వర్గం, ఈశ్వరరాజువర్మకు అనుకూలంగా మరో వర్గం నినాదాలు చేయడం ఈ వివాదానికి కారణమైంది. రెండు వర్గాలూ కలియబడి, ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి శృతి మించింది. నగరం ఎస్సై షేక్ జానీబాషా, పోలీసులు జోక్యం చేసుకుని రెండు వర్గాలనూ చెల్లా చెదురు చేశారు. గొల్లపల్లి, ఈశ్వరరాజువర్మల మధ్య కొంతకాలం నుంచి విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ జయంతిని కూడా రెండు వర్గాలూ పోటాపోటీగా వేర్వేరుగా నిర్వహించాయి. ఈ పరిస్థితుల్లో బస్సు యాత్ర సందర్భంగా బట్టబయలైన విభేదాలు ఎటు దారి తీస్తాయోనని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

న్యాక్ ఏ ప్లస్ హోదాపై
సీఎం జగన్ అభినందనలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీసీల సదస్సులో పాల్గొన్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీకు న్యాక్ ఏప్లస్ రావడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీసీల సదస్సులో జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజును అభినందించి రాష్ట్ర స్థాయిలో సాంకేతిక వర్సిటీలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూ కాకినాడకు ఈ హోదా రావడం సంతోషమని, భవిష్యత్‌లో విదేశీ వర్సిటీలతో ఎంఓయులకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి సూచించారని వీసీ ప్రసాదరాజు తెలిపారు.

ప్రేమికుడు పెళ్లికి నిరాకరించాడని..
యువతి ఆత్మహత్య

కొత్తపేట: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించాడని ఆత్మహత్యకు పాల్పడిన యువతి ఉదంతమిది. కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వాడపాలెం మార్కెట్ వీధికి చెందిన బందారు శివాని (21), అదే గ్రామానికి చెందిన పిల్లా విజయ్ ప్రేమించుకున్నారు. ఆ యువతి తన ప్రేమికుడు విజయ్ వద్ద పలుసార్లు పెళ్లి విషయం ప్రస్తావించగా కాలయాపన చేస్తూ వచ్చాడు. తుదకు పెళ్లికి నిరాకరించాడు. దీంతో మనస్థాపం చెందిన శివాని మంగళవారం మధ్యాహ్నం ఎలకల మందు నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం చేసి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై మణికుమార్ గురువారం రాత్రి తెలిపారు. యువతి తండ్రి బండారు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉపమాక వెంకన్న దర్శనానికి ప్రత్యేక బస్సు



భక్తులతో పాటు ప్రయాణిస్తున్న చాగంటి తదితరులు

కాకినాడ: విశాఖ జిల్లా నక్కపల్లి వద్ద ఉన్న పురాతన, చారిత్రక ప్రాముఖ్యం కలిగిన ఉపమాక వేంకటేశ్వరస్వామి దర్శనానికి గురువారం ప్రత్యేక బస్సును నడిపారు. ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆశ్రమం నుంచి ఆల్ట్రా డిలక్స్ బస్సు బయలుదేరి వెళ్లింది. బ్రహ్మశ్రీ చాగంటి కూడా భక్తులో భక్తులతో పాటు వెళ్లారు. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ మాట్లాడుతూ ఉపమాక దర్శనం కావాలనుకుంటే సరిపడిన విధంగా భక్తులు ఉంటే ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు. వివరాల కోసం 73829 10658, 73829 10778 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్, ఎండీయూ ఆపరేటర్లపై 6ఏ కేసులు



రేషన్‌షాపులో అధికంగా నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని 40వ నంబర్ రేషన్‌షాపులోను, ఎండీయూ వాహనంపైన గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి బియ్యం అధిక నిల్వలను గుర్తించి డీలర్, ఎండీయూ వాహన ఆపరేటర్‌పై కేసులు నమోదు చేసినట్లు మండల పౌరసరఫరాల అధికారి మమత తెలిపారు. రేషన్ షాపులో ఉండాల్సిన బియ్యం కన్నా 214 కిలోల బియ్యం ఎక్కువగా ఉన్నాయని, ఎండీయూ వాహనంలో సైతం 20 కిలోల బియ్యం, 2 కిలోల పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించామని మమత వివరించారు. డీలర్ మెంతుల లక్ష్మిపైన, ఎండీయూ వాహన ఆపరేటర్ సిద్ధాంతపు రాజకుమార్‌లపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు మమత వివరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వై సత్యకిశోర్, విజయకుమార్ పాల్గొని కేసులు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

తల్లీకూతుళ్ల పరస్పర ఫిర్యాదులు

కరప: తల్లీకూతుళ్లు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపైన కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రామకృష్ణ గురువారం రాత్రి తెలిపారు. కరప గ్రామానికి చెందిన భోగిరెడ్డి రాములు, భార్య లక్ష్మీకుమారి ఇంటివద్ద ఉండగా ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు మగవారు ఇంట్లోకి చొరపడి తమపై దౌర్జన్యం చేశారని లక్ష్మీకుమారి కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తల్లిదండ్రులను చూడడానికని ఇంటికి వస్తే తనపైన, తన భర్త మల్లేష్‌బాబు, డ్రైవర్ మోహన్‌బాబు, స్నేహితురాలిపైన ఇటుకముక్కలతో దాడిచేసి, కారును ధ్వంసం చేశారంటూ కాకినాడ శ్రీనగర్‌కు చెందిన నక్కా భాగ్యరాగరాణి కరప పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లీ, కూతురు విడివిడిగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వారిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రి గోడ కూలి 8 మందికి స్వల్ప గాయాలు



ఎంసీహెచ్ బ్లాక్‌లో కూలిన గోడ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశు విభాగంలోని లిఫ్ట్ వద్ద గోడ కూలి గురువారం ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. మెడికల్ కళాశాలగా మారిన నేపథ్యంలో ఆసుపత్రిలో నిర్మాణ పనులు చేస్తున్నారు. దీనికి సంబంధించి లిఫ్ట్ కట్టేందుకు గొయ్యి తవ్వారు. అయితే వర్షాల వల్ల గోతిలో నీరు నిలిచిపోయింది. దీంతో దానికి ఆనుకుని ఉన్న గోడ పూర్తిగా తడిసి.. కూలిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు పేషెంట్‌లకు, మరో నలుగురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన ఆసుపత్రి ఆర్ఎంవో నసీరుద్దీన్ ఆసుపత్రిలోని ఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడ్డ వారికి హుటాహుటిన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం కూలిన గోడ ప్రాంతాన్ని పరిశీలించింది. ఆసుపత్రిలో ఈ విధంగా ఇంకా ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పూర్తిగా ఆ ప్రాంగణంలోని భవనాలన్నీ పరిశీలించారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి



చిన సత్యనారాయణ (ఫైల్)

కాట్రేనికోన: మండలంలోని గెద్దనపల్లి పంచాయతీ బక్కివారిపేటకు చెందిన కౌలు రైతు మాదే చిన సత్యనారాయణ (42)పొలంలో పని చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. బంధువులు చెప్పిన వివరాల ప్రకారం చిన సత్యనారాయణ కుండలేశ్వరం పరిధిలోని గిడ్డివారి పేటలో మూడు ఎకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. వరి సాగు అనంతరం పైరు వేయడంతో మినుములు కోసేందుకు పొలం వెళ్లాడు. అపరాలు కోస్తున్న సమయంలో పాము కాటు వేసింది. అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమానిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: మద్యానికి బానిసై ఇంటిలో ఉరివేసుకుని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మోరంపూడి సాయినగర్‌లో చోటు చేసుకుంది. సూరత్ గిరిధర్(19) తల్లిదండ్రులు చనిపోవడంతో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో మద్యానికి బానిస అయిన గిరిధర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరుసకు సోదరుడైన సలాది నాగబాబు ఇచ్చిన ఫిర్యాదుపై బొమ్మూరు ఎస్సై జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దేవదాయ ధర్మదాయశాఖ
శ్రీ పాముగంటి లక్ష్మీ వెంకయమ్మవారి ధర్మసత్రం,
[illegible] గ్రామం, [illegible] (మం) కాకినాడ జిల్లా
ఖాళీ భూమి [illegible] - సీల్డ్ టెండర్ కమ్ ఈ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన
ఆర్.సి.నెం. 17/2022 — తేది : 12-07-2023

[illegible]

షెడ్యూల్

క్ర. సం.	భూమి గల గ్రామం	R.S. నెం.	విస్తీర్ణం	ధరావత్తు సొమ్ము రూ. పై.	తేది, సమయము, వేలం జరుపు ప్రదేశము	లీజు కాలము
1	[illegible]	230	21-59	2,00,000-00	26.07.2023 [illegible] 11.00 గంటలకు [illegible]	[illegible] 11 సంవత్సరాలు [illegible]
2	[illegible]	232	17-63	2,00,000-00	డిటో	డిటో
3	[illegible]	231	10-20	2,00,000-00	డిటో	డిటో
4	[illegible]	231	20-00	2,50,000-00	డిటో	డిటో
5	[illegible]	231	20-00	2,50,000-00	డిటో	డిటో
			98-41			

ముఖ్య షరతులు : 1. [illegible] APC & HRI & Endowments Act 1987 & G.O.M.S. No.898 తేది 5-8-2003 [illegible] 2. [illegible]

గ్రామం : [illegible] — కార్యనిర్వహణాధికారి
తేది : 12.07.2023 — సెల్ నెం. 73968 59334